ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024




కర్ణాటక మంత్రి శివరాజ్, కన్నయ్యనాయుడు ఆనందం



- తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ స్థానంలో స్టాప్‌లాగ్
- గేట్ తొలి ఎలిమెంట్ అమరిక విజయవంతం
- అడ్డంకులను అధిగమిస్తూ ఒక్కో అడుగు..
- పదుల సంఖ్యలో నిపుణులు..
- వందకు పైగా కార్మికులు
- ఈ నెల 10న కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేట్
- కన్నయ్య నాయుడు నేతృత్వంలో నష్ట నివారణ

సంకల్పానికి సలాం..!



తుంగభద్ర జలాశయం నిండుకుండగా మారి.. 105.78 టీఎంసీలు నిల్వ ఉండగా.. అనుకోని విపత్తు ఎదురైంది. క్రస్ట్ గేట్‌ల నుంచి నదిలోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో.. ఈ నెల 10వ తేదీ రాత్రి సుమారు 10.30 సమయంలో 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయింది. విషయం తెలియగానే లక్షలాది ఎకరాల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రైతాంగంలో ఆందోళన, నైరాశ్యం చోటు చేసుకున్నాయి. కొన్ని గంటల వ్యవధిలో ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. మరీ ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. క్రస్ట్‌గేట్‌ల విషయంలో అపార నైపుణ్యం ఉన్న కన్నయ్య నాయుడును రంగంలోకి దించింది. ఆయన సూచనలతో పక్కా ప్రణాళిక సిద్ధమైంది. వారం రోజులపాటు రేయింబవళ్లు వందలాది మంది శ్రమించారు. శుక్రవారం రాత్రి 9.10 సమయానికి అద్భుతం ఆవిష్కృతమైంది. 'మునుముందు తలెత్తే ఇలాంటి విపత్తులకు ఇది ఒక మోడల్ కావాలి..' అని కన్నయ్య నాయుడు ప్రకటించి 24 గంటలు గడవకనే.. ఆ మోడల్ సాకారమైంది. డ్యాం స్పిల్‌వే 1613 అడుగుల వద్దకు తొలి స్టాప్‌లాగ్ ఎలిమెంట్ వెళ్లి దర్జాగా కూర్చుంది. దానిపై మరో నాలుగు స్టాప్‌లాగ్ ఎలిమెంట్లు ఏర్పాటు చేయడానికి పెద్దగా సమయం పట్టకపోవచ్చు. శనివారం సాయంత్రానికి ఈ ప్రక్రియ సంపూర్ణంగా విజయవంతం కావచ్చు. ఈ లెక్కన.. రేపటి నుంచి చుక్క నీరు వృథా కాదు. ఈ పనులు జరుగుతుండగా.. శుక్రవారం ఆకాశం కూడా హర్షం వ్యక్తం చేసింది. అప్పుడప్పుడు వర్షిస్తూ.. 'ఏం భయంలేదు.. ఇంకా వానాకాలం ఉంది. డ్యాం మళ్లీ నిండుతుంది. మీ శ్రమ వృథా కాదు..' అని ఉత్తేజపరిచింది.

జలం.. ఇక సురక్షితం..

క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిన వారం రోజుల్లో డ్యాం నుంచి తుంగభద్ర నదిలోకి సుమారు 50 టీఎంసీల నీరు వెళ్లింది. డ్యాం క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిన రోజు 105.78 టీఎంసీల నిల్వలు ఉండగా.. తొలి ఎలిమెంట్ అమర్చే సమయానికి శుక్రవారం సుమారు 68 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. ఈ లెక్కన డ్యాం నిల్వల నుంచి 37.7 టీఎంసీల నీరు నదికి, కాల్వలకు వెళ్లింది. దీంతోపాటు డ్యాంలోకి గడిచిన వారం రోజులుగా 40 వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వస్తోంది. ఇది సుమారు 15 టీఎంసీల దాకా ఉంటుంది. మొత్తం 53 టీఎంసీల నీరు కాలువలు, నదిలోకి వెళ్లినట్లు. ఇందులో కాలువలకు 3 టీఎంసీలు అనుకున్నా.. నదిలోకి వెళ్లింది సుమారు 50 టీఎంసీలు. క్రస్ట్‌గేట్ కొట్టుకపోయి ఉండకపోతే.. నది, కాలువలకు పైనుంచి వచ్చి చేరుతున్న 15 టీఎంసీల వరద నీరు మాత్రమే వెళ్లేది. స్టాప్‌లాగ్‌ను ఏర్పాటు చేయకపోతే డ్యాం నుంచి స్పిల్ వే వరకూ (1613 అడుగులు) ఉన్న నీరు మొత్తం దిగువకు వెళ్లేది. స్పిల్ లెవెల్ వద్ద 43 టీఎంసీల నిల్వలు ఉంటాయి. ప్రస్తుతం డ్యాంలో 68 టీఎంసీలు ఉన్నందున.. నిల్వ నీటిలో 25 టీఎంసీల దాకా నిపుణులు కాపాడినట్లు. దీంతోపాటు.. ఇకపై వచ్చే వరదనీటినీ ఒడిసి పట్టుకున్నట్లు. తీవ్ర ఆందోళనకు గురైన రైతాంగానికి ఇంతకు మించిన శుభవార్త ఇంకేముంటుంది..?


(రాయదుర్గం/బళ్లారి/గాంధీనగర్)

గేటు ఏర్పాటు విజయవంతం

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం అర్బన్, ఆగస్టు 16: తుంగభద్ర డ్యామ్‌లో 19వ గేట్‌కు సంబంధించిన మొదటి గేట్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 19వ గేట్‌కు సంబంధించి మొదటి గేటును విజయవంతంగా దింపిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. టీబీ డ్యామ్‌లో 19వ గేట్ కొట్టుకుపోయిన పరిస్థితుల్లో శుక్రవారం అనుకున్నది అనుకున్న ట్లుగా చాలా విజయవంతంగా గేట్ దింపారన్నారు. శుక్రవారం రాత్రికి రెండు, మూడు, నాలుగు గేట్లను కూడా దింపుతారని వెల్లడించారు. భారతదేశ చరిత్రలో నది నీటి ప్రవాహం ఉన్న తరుణంలో గేటు ఏర్పాటు చేయడం అనేది ఇంజనీరింగ్ అధికారుల సాహసోపేత చర్య అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందించారన్నారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో మన కోసం పనిచేసిన కార్మికులు, అధికారులు, కర్ణాటక ప్రభుత్వానికి జిల్లా రైతాంగం తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఈ రోజు రాత్రి ఎంతసేపైనా 19వ గేట్‌లో మరో రెండు, మూడు గేట్లు ఏర్పాటును పర్యవేక్షిస్తామన్నారు.


తొలి స్టాప్‌లాగ్ ఇదే..

అమూల్య జల సంపదను కాపాడిన నిపుణులు

అడ్డంకులను అధిగమిస్తూ..!

19వ క్రస్ట్‌గేట్ స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాగ్ గేట్‌ను అమర్చేందుకు కన్నయ్యనాయుడు నేతృత్వంలోని నిపుణుల బృందం శుక్రవారం ఉదయం 9 గంటలకు పనులను పునః ప్రారంభించారు. కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ స్థానంలో తెగిపోయిన గేట్ ముక్క గైడ్ యాంగిల్ వద్ద అడ్డుగా ఇరుక్కుపోవడంతో దానిని గుర్తించి, మధ్యాహ్నానికి ఒడ్డుకు తీసుకొచ్చారు. తమిళనాడుకు చెందిన జిందాల్ కార్మికులు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి దిగి ఆ ముక్కను క్రేన్ల సాయంతో ఒడ్డుకు చేర్చారు. రెండురోజులుగా అక్కడున్న క్రేన్ల సామర్థ్యం తక్కువగా ఉండడంతో 90 టన్నుల కెపాసిటీ కలిగిన మరో రెండు క్రేన్లను హుటాహుటిన తెప్పించి వినియోగిస్తున్నారు. ఇప్పటికే 60 అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తు ఉన్న రెండు గేట్ ఎలిమెంట్‌లను 19వ క్రస్ట్ గేట్ వద్ద ఆనకట్టపై సిద్ధంగా ఉంచారు. వాటిలో ఒక గేట్‌ను దించేందుకు ప్రయత్నించగా క్రేన్లకు ఒక వైపు కౌంటర్ వెయిట్, మరో వైపు హాయిస్ ప్లాట్‌ఫాం ఆటంకం కలిగించాయి. దీంతో కన్నయ్యనాయుడు సూచన మేరకు వాటిని తొలగించారు. హాయిస్ ప్లాట్‌ఫారంను సాయంత్రానికి తీసి ఆనకట్టపై ఓ పక్క ఉంచేశారు. క్రస్ట్‌గేట్‌కు ముందువైపు పై భాగంలో 30 టన్నుల బరువున్న కౌంటర్‌వెయిట్‌ను జాగ్రత్తగా 1633 అడుగుల వరకు కిందకు దించారు. ఇలా.. స్టాప్ లాగ్ గేట్ తొలి ఎలిమెంట్‌ను గైడ్‌యాంగిల్‌లో కూర్చోబెట్టేందుకు పైభాగంలో అడ్డంగా ఉండే ఆ రెండింటిని తొలగించారు. అనంతరం క్రేన్ల సాయంతో ఎలిమేట్‌ను గైడ్‌యాంగిల్‌లో అమర్చేందుకు సాయంత్రం 6 గంటల నుంచి పనులను ప్రారంభించారు. డ్యాం నుంచి క్రస్ట్ గేట్‌ల ద్వారా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి వద్ద ఈ ప్రక్రియ సాగింది. అనుకోని ప్రమాదం తలెత్తితే నిపుణులు, కార్మికులను కాపాడేందుకు డ్యాం దిగువన నదిజలాలలో బోర్డు అధికారులు రెండు రెస్క్యూ టీంలను సిద్ధంగా ఉంచారు. ప్లాస్టిక్ పడవలలో ఈ రెండు బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.


దిగువకు కౌంటర్ వెయిట్

మరిన్ని వివరాలు మెయిన్‌లో...

ఎస్పీ మురళీకృష్ణ బదిలీ

కొత్త ఎస్పీ జగదీశ్


జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు 16: ఎస్పీ కేవీ మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఆయనను విశాఖపట్నం 16వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న పి.జగదీశ్‌ను నియమించారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జగదీశ్ కర్ణాటకవాసి. తొలుత చిత్తూరు ఏఎస్పీగా పనిచేశారు. అనంతపురం 14వ బెటాలియన్ కమాండెంట్‌గా, పాడేరులో గ్రేహౌండ్స్ కమాండర్‌గా, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా పనిచేశారు. ఇటీవల ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఆయనను డీజీపీకి రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. కేవీ మురళీకృష్ణ బదిలీతో వెయిటింగ్‌లో ఉన్న జగదీశ్‌ను అనంతపురం జిల్లా ఎస్పీగా నియమించారు. కేవీ మురళీకృష్ణ వ్యక్తిగత కారణాలతో విశాఖకు బదిలీ చేయించుకున్నారని సమాచారం. ఆయన భార్య క్యాన్సర్ వైద్య నిపుణురాలు. విశాఖలో ఆమె పనిచేస్తున్నారు. ఆ పోస్టు అనంతలో లేకపోవడంతో ఎస్పీ మురళీ కృష్ణ అక్కడికి బదిలీ చేయించుకున్నారని సమాచారం.

అప్పుడే రావాల్సింది..

జిల్లాకు వస్తున్న ఎస్పీ జగదీశ్ తూర్పు గోదావరి జిల్లాలో మాత్రమే ఎస్పీగా పనిచేశారు. ఇక్కడి ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా కొంతకాలం పనిచేయడంతో జిల్లాపై అవగాహన ఉంది. ఎన్నికల ముందు జరిగిన బదిలీల సమయంలోనే ఆయన జిల్లాకు వస్తారనే ప్రచారం జరిగింది. కానీ అప్పుడు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేశారు. ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే పేరుంది. అధికారులు, సిబ్బంది అవినీతిపైనా కఠినంగా వ్యవహరిస్తారని సమాచారం.

నిష్పక్షపాత విచారణ జరగాలి

రాక్రీట్ దోపిడీపై పరిటాల సునీత



అనంతపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాక్రీట్ సంస్థ ద్వారా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన అవినీతి, అక్రమాలపై నిష్పక్షపాతంగా విజిలెన్స్ విచారణ జరగాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. పేదల సొంతిటి కలను కలగా మార్చిన మాజీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని, దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలని ఆమె విచారణాధికారులను డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని తన నివాసంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి రూ.200 కోట్లదాకా అక్రమాలు చేశారని ఆరోపించారు. రాక్రీట్ సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టి.. ఇసుక, సిమెంట్, ఇనుము తదితరాలలో భారీగా దోచేశారని ఆరోపించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా వైఎస్సార్, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని గృహనిర్మాణ పనుల్లో అక్రమాలు జరిగాయని అన్నారు. రాక్రీట్ సంస్థకు కేటాయించిన ఇళ్లలో 13 వేల ఇళ్లను గతంలోనే రద్దు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఇళ్లను నిర్మించకుండానే బిల్లుల చెల్లింపులు జరిగాయని అన్నారు. ఈ దోపిడీపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథికి ఆధారాలతో తాను ఫిర్యాదు చేశానని తెలిపారు. విచారణాధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా అక్రమాలను నిగ్గుతేల్చాలని కోరారు. కాగా, ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ విచారణాధికారుల్లో ఒకరు, ఆ శాఖకు చెందిన మరో ముఖ్య అధికారి రాక్రీట్ సంస్థ అక్రమాలను కప్పిపెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తుండటం గమనార్హం.

మంత్రి కేశవ్ ప్రజా దర్బారు


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 16: ప్రజా దర్బార్‌కు వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బారు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను మంత్రి సావధానంగా విన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తోందని అన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన వెంటనే అధికారులకు మంత్రి ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

మత్తుపై గట్టి నిఘా ఉంచండి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఆగస్టు 16: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై గట్టి నిఘా ఉంచాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. డ్రగ్స్ వాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని అన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో జరిగే అనర్థాల గురించి విద్యాలయాలలో సదస్సులు నిర్వహించి, అవగాహన కల్పించాలని ఆదేశించారు. డ్రగ్స్ జిల్లాలోకి సరఫరా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారిక లెక్కల మేరకు జిల్లాలో 1,220 మెడికల్ షాపులు ఉన్నాయని, ఇందులో 220 మెడికల్ షాపులకు సీసీ కెమెరాలు లేవని అన్నారు. వందశాతం మెడికల్ షాపులలో కెమెరాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘాపెట్టి, తనిఖీలు నిర్వహించాలని అన్నారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో డీ అడిక్షన్ వార్డులో అంకితభావంతో పనిచేసే డాక్టర్లు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మత్తుపదార్థాల కట్టడికి పోలీసు యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. గ్రామాల వారీగా వాహనాలు ఏర్పాటు చేసి డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీడియోలు ప్రదర్శిస్తామని అన్నారు. అన్నికళాశాలలు, పాఠశాలలలో నో డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయిస్తామని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్వో రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు వసంతబాబు, శ్రీనివాసులురెడ్డి, డీటీసీ వీర్రాజు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడైనా పట్టుకోండి..!

అనంతపురం క్రైం, ఆగస్టు 16: 'బైక్ పోయిందని ఫిర్యాదు చేశాను. మీరు పట్టుకోలేకపోయారు. ఎత్తుకెళ్లిన దొంగ దర్జాగా తోలుతున్నాడు. నిబంధనలు అతిక్రమించినందుకు పోలీసులు జరిమానా కూడా వేశారు. ఆ మెసేజ్ నా మొబైల్ ఫోన్‌కు వచ్చింది. ఇప్పటికైనా దొంగను పట్టుకోండి. నా బైక్‌ను రికవరీ చేయండి..' అని త్రీటౌన్ పోలీసులను కోరాడు బాధితుడు. నగరంలోని ఐదో రోడ్డుకు చెందిన మదన్ బైక్‌ను ఆరు నెలల క్రితం దొంగలు ఎత్తుకుపోయారు. ఆర్ట్స్ కళాశాల వద్ద పార్కింగ్ చేశానని, అది మాయమైందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్నాళ్లు బైక్ దొరకలేదు. కేస్ పెండింగ్‌లో ఉంది. ఇంతలో ఆ బైక్‌కు ఫైన్ వేసినట్లు మదన్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. యల్లనూరు మండలం తిమ్మంపల్లి సమీపంలో పోలీసులు తనిఖీ చేస్తుండగా తన బైక్ కనిపించిందని, దానికి జరిమానా వేశారని బాధితుడు వాపోయాడు. పోలీసులను శుక్రవారం కలిసి విషయం తెలియజేశానని తెలిపాడు.

పోలీసులకు చిక్కిన దొంగల ముఠా

ఓఎంసీలో సీజ్ చేసిన వాహనాల తుక్కు చోరీకి యత్నం

పది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


అదుపులో తీసుకున్న బొలెరో వాహనం


విడగొట్టిన సీజ్ చేసిన తుక్కు యంత్రం


పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఉన్న పట్టుబడ్డ వ్యక్తులు

డీ.హీరేహాళ్, ఆగస్టు 16: ఏపీ, కర్ణాటక సరిహద్దులో సీబీఐ సీజ్ చేసిన వాహనాలను కట్ చేసి, విడిభాగాలను చోరీ చేస్తున్న పది మంది శుక్రవారం పోలీసుల చేతికి చిక్కారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో సీబీఐ కొన్నేళ్ల క్రితం ఇనుప ముడిఖనిజంతో పాటు అక్కడి యంత్రాలు, వాహనాలను సీజ్ చేసింది. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ముడిఖనిజాన్ని తరలించి, కర్ణాటకలో విక్రయించిన ముఠానే తాజాగా దొంగతనానికి పూనుకున్నట్లు తెలిసింది. వాహనాలలో 10 మంది బృందంగా వచ్చి గ్యాస్ కట్టర్లతో తుప్పుపట్టిన వాహనాలను విడిభాగాలుగా తొలగించారు. అనంతరం వాహనాల విడిభాగాలను ఎత్తుకపోయేందుకు ప్రయత్నం చేస్తుండగా పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులో తీసుకున్నారు. బళ్లారితో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు చోరీకి ప్రయత్నించారని సమాచారం. ముడి ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్నవారే చోరీకి ప్రయత్నించారని అనుమానాలు కలుగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, కర్ణాటకలోని బళ్లారికి చెందిన నలుగురు, సిద్ధాపురం గ్రామానికి చెందిన ఒకరు, మరొకరు ముఠాగా ఏర్పడి పెద్ద పెద్ద కట్టర్లతో ఓఎంసీ మైనింగ్ ప్రాంతంలోకి ప్రవేశించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి వెళ్లి వారిని అదుపులో తీసుకున్నారు. కట్టర్లను, గ్యాస్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిని లోతుగా విచారిస్తున్నారని తెలిసింది. గత ప్రభుత్వంలో ముడి ఖనిజం అపహరించిన వివరాలను కూడా పూర్తి స్థాయిలో సేకరిస్తున్నట్లు తెలిసింది.

నిరుద్యోగ యువతకు తీపికబురు

నైపుణ్యాల పెంపునకు ప్రభుత్వం శ్రీకారం

అనంతపురం సెంట్రల్/ రూరల్, ఆగస్టు 16: నిరుద్యోగ యువతలో నైపుణ్యాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగిన యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఇందుకోసం స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. స్థానిక వనరులు, డిమాండ్‌కు అనుగుణంగా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించింది. జిల్లాలో ఎనిమిది స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటుచేసి ఒక్కో కేంద్రంలో 30మందికి శిక్షణ ఇవ్వనుంది. నార్పల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్. గుంతకల్లు ఎన్‌ఏసీలో హెల్పర్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్. తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమిస్టిక్ వాయిస్, డేటా ఎంట్రీ ఆపరేటర్. ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అసిస్టెంట్ సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, కళ్యాణదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, అసిస్టెంట్ సర్వేయర్, అనంతపురం ఎన్‌ఏసీలో హెల్పర్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డేటా ఎంట్రీ, గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డెస్క్‌టాప్ పబ్లిషింగ్, వెబ్ డెవలపర్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

సహాయక కేంద్రాల నంబర్ల వివరాలు

కేంద్రం	నంబరు
అనంతపురం	7995482414
శింగనమల	9010039901
తాడిపత్రి	9133004626
గుంతకల్లు	8096763970
ఉరవకొండ	7013800115
కళ్యాణదుర్గం	9010965230
రాప్తాడు	7075657772
రాయదుర్గం	9182920381[1]

ఉపాధి కల్పనే ధ్యేయం: ఆనంద్ రాజ్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

18నుంచి 30 సంవత్సరాలు కలిగిన నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయంగా స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశాం. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో మూడునెలల ఏకకాలంలో 480మందికి శిక్షణ ఇస్తాం. 19లోగా క్యూఆర్ కోడ్ లేదా https //forms.gle/fyvyjDQL3HTmEaje8 ద్వారా రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు వారి సమీపంలోని కేంద్రాల్లో విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్, పాస్‌పోటోలను సమర్పించాలి.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 267టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.25

అనంతపురం రూరల్, ఆగస్టు 16: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 4500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.14, కనిష్ఠ ధర రూ.6?పలికినట్లు ఆయన తెలిపారు.

'జీడిపల్లికి' ఇన్‌ఫ్లో 643 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 16: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు శుక్రవారం 643 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 0.466 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

ఇక్కడ ఉండలేం!

- గడేకల్లు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు
- రోజుకొకరు కసువు ఊడ్చేలా చార్టు తయారీ
- మందుబాబులకు అడ్డాగా వసతి గృహం
- పక్కదారి పడుతున్న బియ్యం, సరుకులు
- అసాంఘిక కార్యకలాపాలపై గ్రామస్థుల ఆగ్రహం

విడపనకల్లు, ఆగస్టు 16: మండలంలోని గడేకల్లు ఎస్సీ బాలుర వసతి గృహంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని గ్రామ పెద్దలు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంగా వార్డెన్‌ను నిలదీస్తున్నారు. గ్రామ పెద్దలు భీమలింగప్ప, శ్రీనివాసులు, హరి, పరమేష్‌లు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ హాస్టల్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారినా వార్డెన్ పట్టించుకోవటంలేదన్నారు. 65 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో ఒక వంట మనిషి మాత్రమే ఉన్నారన్నారు. ఇతడు విద్యార్థులు చేత మద్యం తెప్పించుకోవటం, అక్కడికి వచ్చిన తన స్నేహితులకు కూడా మద్యం తెప్పించి అక్కడే తాగుతూ ఖాళీ ప్యాకెట్లు పడేస్తున్నాడని ఆరోపించారు. హాస్టల్ ప్రాంగణంలో ఎక్కడ చూసినా కర్ణాటక మద్యం బాటిళ్లు కనిపిస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ప్రాతినిత్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఎస్సీ విద్యార్థులను ఇంత దారుణంగా ఇబ్బంది పెట్టటం సరికాదన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడం లేదన్నారు. మరుగు దొడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకోరా మీ ఇంట్లో మీ పిల్లలకు ఇలా ఉంటే చూస్తూ ఊరుకుంటారా అని ప్రశ్నించారు. పిల్లలు చేత కసువు ఊడిపించడం, డ్రైనేజీలు క్లీన్ చేయించటం, గదులను కడిగించడం వంటి పనులు చేయించడం దారుణమని మండిపడ్డారు. కోడిగుడ్లు వారానికి ఐదుసార్లు ఇవ్వాల్సి ఉండగా మూడు రోజులే ఇస్తున్నారన్నారు. ఒక లీటర్ పాలలో రెండు జగ్గుల నీరు కలిపి 65మంది పిల్లలు తాగాలంటా! ఇదెక్కడి అన్యాయమని ప్రశ్నించారు. విద్యార్థులకు భోజనం సక్రమంగా పెట్టకుండా బియ్యాన్ని, సరుకులను బయటి వ్యక్తులకు విక్రయిస్తుండటంతో గత మంగళవారం రాత్రి కాపు కాచి బియ్యం తరలిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీసినట్లు గ్రామస్థులు వెల్లడించారు. వర్షాకాలంలో గోడలకు విద్యుత్ సరఫరా అయ్యి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా వార్డెన్ పట్టించుకోవడం లేదన్నారు. హాస్టల్‌లో తమకు రక్షణ లేకుండా పోయిందంటూ విద్యార్థులు ఆవేదన చెందారు. ఈ వార్డెన్ మాకు వద్దు అంటూ నినాదాలు చేశారు. పరిస్థితులు ఇలా ఉంటే ఎలా హాస్టల్‌లో ఉండేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



హాస్టల్ ప్రాంగణంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు



పాడైపోయిన స్నానాల గదులు



స్వీపింగ్, క్లీనింగ్ చార్టును చూపుతున్న విద్యార్థులు



వార్డెన్‌తో గ్రామస్థుల వాగ్వాదం



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఎవరూ పట్టించుకోరు



ఎస్సీ హాస్టల్‌లో ప్రతిరోజూ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా పట్టించుకునే వారేలేరు. ఇక్కడ విద్యార్థుల చేతనే మందు బాబులకు మందు తెప్పించి ఇస్తున్నారు. రాత్రి సమయంలో వ్యభిచారం జరుతున్నా ఒక్కరు స్పందించరు. వార్డెన్ హాస్టల్‌కు అస్సలు రావటంలేదు. బియ్యాన్ని బయటి వ్యక్తులకు అమ్ముకుంటున్నారు. హాస్టల్ ప్రహరీ ముందే కర్ణాటక మద్యం అమ్ముతున్నా అధికారులు స్పందించటంలేదు.

- హరి, గ్రామస్థుడు గడేకల్లు

భోజనం కూడా పెట్టటం లేదు



ఎస్సీ హాస్టల్‌లో వివిధ గ్రామల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నారు. కానీ ఇక్కడ విద్యార్థులకు సరైన భోజనం పెట్ట కుండా బియ్యాన్ని, సరుకులను కిరాణ షాపులకు అమ్ముకుం టున్నారు. హాస్టల్‌లోకి పాములు, పందులు వస్తున్నాయి. డ్రైనేజీలు, గదులను విద్యార్థులే క్లీన్ చేయాలని చార్టులు తయారు చేయించి పనులు చేయిస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకుని విద్యార్థులకు న్యాయం చేయాలి.

- పరమేశ్, గడేకల్లు గ్రామస్థుడు

మద్యం మేమే తెచ్చివ్వాలి



మాది గుంతకల్లు. ఈ హాస్టల్‌లో ఉంటూ గత ఏడు సంవత్సరాలుగా చదువుకుంటున్నా. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నా. సంవత్సర కాలం నుంచి మాకు హాస్టల్‌లో నరకం చూపిస్తున్నారు. వార్డెన్ అస్సలు ఉండరు. ఎక్కడెక్కడి వారో వస్తారు. రాత్రి సమయంలో ఇక్కడే తాగి తిని పోతూ ఉంటారు. ఇక్కడ సిబ్బంది మా చేతనే వారికి మద్యం తెప్పించి ఇస్తారు. తీసుకురాక పోతే కొట్టి వేధిస్తారు.

- వీరేశ్, 10వ తరగతి విద్యార్థి

బాత్‌రూంలు కూడా లేవు



హాస్టల్‌లో బాత్‌రూంలు లేవు. టాయిలెట్స్ లేవు. కనీసం స్వీపర్లు కూడా లేరు. టైంకి సరైనా భోజనం లేదు. నరకం ఎక్కడో కాదు ఈ హాస్టల్‌లోనే ఉంది. రాత్రి సమయాల్లో గదుల్లో నిద్రిస్తున్నా సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కిటికీలు కొడుతున్నారు. ఒక్కోసారి డోర్లు తెరుచుకొని గదుల్లోకి వస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవటంలేదు.

- జి. వంశీ, 10వ తరగతి

రోజూ ఒకరు కసువు ఊడ్చాలి



రూంల్లో కసువు మేమే ఊడ్చుకోవాలి. స్వీపర్ లేదు. కసువు రోజుకొకరు చెప్పిన ఊడ్చాలి. ఇందు కోసం ఒక చార్టు తయారు చేశారు. కసువు ఊడ్చి, బండలు కడగకపోతే ఆ రోజు మాకు భోజనం పెట్టరు. ఇక్కడ మందు తాగే వాళ్లు ఎక్కువైపోయారు. రాత్రి అయితే చాలు ఎవరెవరో వస్తూ పోతుంటారు. ఎస్సీ హాస్టల్స్ ఇలానే ఉంటాయటా బీసీ హాస్టల్స్‌లో అయితే మంచాలు, బెడ్‌లు ఉంటాయట మాకు ఎలాంటి సౌకర్యాలు ఉండవు అని బెదిరిస్తున్నారు. హాస్టల్‌లో వార్డెన్ అస్సలు ఉండరు. సిబ్బంది కూడా ఉండరు.

- అశోక్, 8వ తరగతి విద్యార్థి

అలాంటివేం జరగడం లేదు

హాస్టల్‌లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగటం లేదు. విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నాం. స్వీపర్లు లేనందున ఎవరి రూముల్లో వాళ్లు స్వీపింగ్ చేసుకోవాలని సూచించా. అంతే కానీ రోజు ఒకరు కసువు ఊడ్చాలని చెప్పలేదు. ఎటువంటి చార్టును తయారు చేయలేదు.

- జగన్నాథ్, హాస్టల్ వార్డెన్ గడేకల్లు

ఆట మొదలైందా?

- ఆడుదాం ఆంధ్ర పేరుతో దోపిడీ
- రూ.60 లక్షలకుపైగా నిధుల స్వాహా
- గతంలో పనిచేసిన చీఫ్‌కోచే సూత్రధారి?
- నిధుల గోల్‌మాల్‌పై పోలీసులకు ఫిర్యాదు
- తప్పుల సర్దుబాటుపై రహస్య యత్నాలు
- తిన్న సొమ్ము కూటమి ప్రభుత్వం కక్కించేనా?

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16: 'తింటే' అరుగుతుందా లేదా అన్న వివేచన లేదు. అది ప్రభుత్వ సొమ్ము అయితే చాలు మింగేద్దాం అనే రీతిలో కొందరు అధికారులు గత వైసీపీ ప్రభుత్వ పాలనలో వ్యవహరించారు. ఇందుకు ఉదాహరణే ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు. క్రీడా పోటీల పేరుతో జిల్లాలో సంబంధిత శాఖాధికారి అప్పనంగా దోచేశారు. క్రీడాకారులకు అరకొర సౌకర్యాలు కల్పించి, నాసిరకమైన క్రీడా సామగ్రి అందజేసి మమ అనిపించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) చీఫ్‌కోచ్‌గా పనిచేసిన నరసింహారెడ్డి రూ.60లక్షల వరకు కాజేసినట్లు సమాచారం. అప్పటి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు నిధులు ఖర్చు చేశారు. జిల్లా కన్వీనర్‌గా డీఎస్ఏ చీఫ్‌కోచ్‌లను నియమించారు. నిధుల వినియోగం మొత్తం చీఫ్ కోచ్‌ల ద్వారానే జరిగింది. అయితే నిధుల స్వాహా విషయం బయటపడక ముందే అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో డీఎస్ఏ చీఫ్‌కోచ్‌గా ఉన్న నరసింహారెడ్డి హడావుడిగా విజయవాడకు బదిలీపై వెళ్లారు. నిధులు స్వాహా చేసి జాగ్రత్తగా తప్పుకున్నానని ఆయన అనుకుంటున్న తరుణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ, నిధుల గోల్‌మాల్‌పై ప్రభుత్వానికి, పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో నిధుల స్వాహా అంశాలు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయి. డీఎస్ఏ చీఫ్‌కోచ్ ఒక్కరే నిధులు స్వాహా చేశారా లేక ఇందులో అధికారులు, ప్రజా ప్రతినిధుల భాగ స్వామ్యం ఉందా అనే అంశాలు విచారణలో నిగ్గుతేలనున్నాయి. విజయవాడకు బదిలీపై సాధారణ కోచ్‌గా వెళ్లిన నరసింహారెడ్డికి తిరిగి గుంటూరు డీఎస్‌డీఓ బాధ్యతలు అప్పగించడంపై క్రీడాలోకం విస్మయం వ్యక్తం చేస్తోంది. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు అప్పట్లో వైసీపీ ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో మద్దతు పలికిన చీఫ్‌కోచ్‌కు ఉన్నత పోస్టు ఇచ్చి అందలం ఎక్కించడంపై విమర్శలు వినవస్తున్నాయి.



క్రీడాకారులు లేని టెంట్లు



నాసిరకంగా క్రికెట్ కిట్లు

లెక్కలు తేలాలి



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల సమయంలో జిల్లాలో నేను లేను. ఆ పోటీల సమయంలో డీఎస్‌డీఓగా నరసింహారెడ్డి ఉన్నారు. అయితే ఇప్పటికే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై అనేక మంది ఫిర్యాదు చేస్తున్నారు. అసలు జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు ఎంత నిధులు వచ్చింది. ఎంత ఖర్చు పెట్టారో ఆ లెక్కలన్నీ తేలాల్సి ఉంది. ప్రభుత్వ సొమ్ము ప్రతిపైసాకు లెక్క చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉంది. శాప్ నుంచి కొన్ని వివరాలు తీసుకోవాలి, ఇక్కడ ఎంత ఖర్చు పెట్టారనే వివరాలను తెలుసుకోవాలి. అన్నీ వివరాలతో సమగ్రంగా శాప్, ప్రభుత్వానికి నివేదిస్తాం.

- షేక్ షఫీ, డీఎస్‌డీఓ

జిల్లాకు రూ.1.2 కోట్ల నిధులు

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు జిల్లాకు రూ.1.2కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు. ఇందులో గ్రామ-వార్డు స్థాయి నుంచి మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిలలో నిర్వహించారు. భోజనం, నిర్వహణ, ప్రైజ్ మనీ, ట్రాన్స్ పోర్ట్ అని నాలుగు కేటగిరీలలో నిధులు చెల్లించారు. అయితే గ్రామ-వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయిలో భోజనాలు సంగతి దేవుడెరుగు....కనీసం తాగునీరు, నీడ ఏర్పాటు చేయలేదు. జిల్లాకు చెల్లించిన రూ.1.2కోట్లలో గత డీఎస్ఏ చీఫ్‌కోచ్ ప్రస్తుతం గుంటూరు జిల్లా డీఎస్‌డీఓగా పనిచేస్తున్న నరసింహారెడ్డి రూ.60లక్షల వరకు స్వాహా చేసినట్లు ఆశాఖలోనే చర్చించుకుంటున్నారు.

రహస్యంగా జిల్లాకు వచ్చి వెళ్లిన మాజీ చీఫ్‌కోచ్

ఆడుదాం ఆంధ్రా నిధుల గోల్‌మాల్‌లో కీలకపాత్రధారిగా ఉన్న అప్పటి డీఎస్ఏ చీఫ్‌కోచ్ బదిలీపై వెళ్లిన తర్వాత సుమారు పది దఫాలుగా జిల్లాకు రహస్యంగా వచ్చివెళ్లినట్లు సమాచారం. నిధులు దుర్వినియోగంలో విషయాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు అన్ని సర్దుబాటు చేసుకోవడానికే జిల్లాకు రహస్యంగా వచ్చి వెళ్లారని క్రీడాభిమానులు చెబుతున్నారు.

రూ.60 లక్షలకు పైగా నిధుల స్వాహా

జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల పేరుతో సుమారు రూ.60లక్షలకు పైగా నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. జిల్లాకు మంజూరైన రూ.1.2కోట్ల నిధులను వివిధ మార్గాల్లో కాజేసినట్లు సమాచారం. భోజనాలకు రూ.20లక్షలు మంజూరైతే కనీసం రూ.ఐదు లక్షలు కూడా ఖర్చు పెట్టిన దాఖలాలు లేవు. ఇక ట్రాన్స్‌పోర్ట్‌కు రూ.30లక్షలకు పైగా నిధులు మంజూరు కాగా రూ.15లక్షల వరకు మాత్రమే ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. నిర్వహణకు రూ. 20లక్షలు నిధులు మంజూరు కాగా రూ.10లక్షలు కూడా ఖర్చు పెట్టలేదు. ప్రైజ్‌మనీ కింద రూ.50లక్షల వరకు నిధులు మంజూరు చేయగా రూ.30లక్షలు వరకు మాత్రమే చెల్లించినట్లు తెలుస్తోంది. మొత్తంగా జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలతో క్రీడాకారులకు ఏమోగానీ క్రీడాశాఖ అధికారులకు మాత్రం బ్రహ్మాండంగా మేలు జరిగిందనే విమర్శలు ఉన్నాయి.



డీఎస్ఏ ఇండోర్‌స్టేడియం

ఉత్సాహంగా కేపీఎల్ క్రికెట్ పోటీలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 16: యువత లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేం దుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కేపీఎల్ (కళ్యాణదుర్గం ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడామైదానంలో గురువారం ఈ పోటీలను ప్రారంభించారు. ఈ నెల 18 వరకు 32 మ్యాచ్‌లు జరుగనున్నాయి. విజేత జట్టుకు రూ.2 లక్షలు, రన్నర్లకు రూ. లక్ష బహుమతులు ప్రకటిం చారు. క్రికెట్ జట్లకు క్రీడా దుస్తులు, బూట్లు ఉచితంగా అందజేశారు.



కరణం చిక్కప్ప క్రీడామైదానంలో జరుగుతున్న కేపీఎల్ క్రికెట్ పోటీలు

యువతకు స్ఫూర్తి



ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఐపీఎల్ తరహాలో కేపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభించడం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రికెట్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి.

- అక్కులప్ప, కెప్టెన్, టీమ్ తారక్ టైగర్స్

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



కేపీఎల్ పోటీలు నిర్వహించి మాలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎమ్మెల్యే సురేంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయం. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగే పోటీలను చూడటానికి ఎంతో మంది క్రీడాభిమానులు వస్తున్నారు.

- జయరాజ్, కెప్టెన్, మీసేవా ఫైటర్స్

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 16: కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ బాలిక కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వితీయ సెమిస్టర్ రీవాల్యుయేషన్ పరీక్షా ఫలితాలను శుక్రవారం ప్రిన్సిపాల్ శంకరయ్య విడుదల చేశారు. జూలై లో నిర్వహించిన బీఎస్సీ, బీకాం హానర్స్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి రీవాల్యుయేషన్ చేసినట్లు వెల్లడించారు. ఫలితాలకోసం కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, సీతః శివశంకర్, అధ్యాపకులు రామలింగారెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరి

మరో మూడురోజులు ఇదే పరిస్థితి

బుక్కరాయసముద్రం, ఆగస్టు16: ఉమ్మడి జిల్లాలో వేసవి కాలాన్ని తలపించేలా ఎండ, ఉక్కపోత ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. నాలుగు రోజుల నుంచి ఉమ్మడి జిల్లాలో భరించలేని ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాకాలంలో కూలర్లు, ఏసీల కోసం వెంపర్లాడే పరిస్థితి. ఆగ్నేయ అరేబియా సముద్రం, దక్షిణ కేరళ తీరం మీదగా ఏర్పడిన ఉపరిత ఆవర్తనం ప్రస్తుతం కర్ణాటక, సరిహద్దు ప్రాంతాల మీద విస్తరించి ఉంది. ఈ ప్రభావంతోనే ఉమ్మడి జిల్లాలో రానున్న నాలుగు రోజులు పగటి ఉష్ణోగ్రతలు పెరుగతాయని వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. వీటితో పాటు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ప్రభావంతో మరో నాలుగురోజులపాటు ఉక్కపోత తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ఉపరితల ఆవర్తనం విస్తరించడంతో గాలిలో తేమ శాతం పెరగడం ఈ ఉక్కపోతకు ప్రధాన కారణమన్నారు. ప్రస్తుతం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 33-34 సాధారణ డిగ్రీల సెల్సియస్ నమోదు కావాలన్నారు. అయితే సాధారణం కంటే అదనంగా 2-3 డిగ్రీల సెల్సియస్ నమోదు అయినట్లు శాస్త్రవేత్త తెలిపారు.

రానున్న ఐదురోజులకు వర్ష సూచన

ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజులు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. పగటి ఉష్ణోగ్రత 35.8- 36.4 డిగ్రీల సెల్సియస్ నమోదు అవుతుందన్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రత 25.4- 25.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని తెలిపారు. గాలులు గంటకు 3కి.మీ నుంచి 7 కిమీవేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

వైద్యుల ఆందోళన ఉధృతం

అనంతపురం టౌన్, ఆగస్టు 16: ఇటీవల కోల్‌కతా వైద్య కళాశాలలో పీజీ మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ అనంత జిల్లాలో డాక్టర్లు ఆందోళన ఉధృతం చేశారు. అఘాయిత్యానికి పాల్పడిన దుర్మార్గుడిని కఠినంగా శిక్షించాలని, డాక్టర్ల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా బోధనాసుపత్రికి చెందిన జూనియర్ డాక్టర్లు, పీజీలు గతనాలుగు రోజులుగా వివిధ రూపాల లో నిరసనలు సాగిస్తూ వస్తున్నారు. శుక్రవారం వైద్య కళాశాలలో రిలేదీక్షలు సాగిస్తూ ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. శనివారం నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈమేరకు జిల్లా వైద్యకళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ మాణిక్యారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావులకు సమ్మె నోటీస్ అందజేశారు.

బంద్‌కు మద్దతు

మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్యచేయడం అన్యాయమని ఆందోళన చేస్తున్న డాక్టర్లపై మళ్లీ దాడులు చేయడం దుర్మార్గమని ఐఎంఏ నేతలు డాక్టర్ హేమలత, మనోరంజన్‌రెడ్డి, శ్రీకాంత్ పేర్కొన్నారు. అందుకే డాక్టర్ల ఆందోళనకు తాముకూడా మద్దతు ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా ఒక్కరోజు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు బంద్ చేస్తున్నామన్నారు. శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు ఎలాంటి అత్య వసర కేసులకు చికిత్సలు అందించబోమని ఓప్రకటనలో తెలిపారు.

మెడికల్‌రెప్స్, నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్స్ సంఘీభావం

జూనియర్ డాక్టర్లు, పీజీల ఆందోళనలకు మెడికల్ రెప్స్ అసో సియేషన్ నాయకులు విశ్వనాథ్, మంజు, అమర్నాథ్ ఓ ప్రకటనలో సంఘీభావం తెలిపారు. అలాగే నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ నాయకులు సైతం శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు వైద్యసేవలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు.



ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేస్తున్న జూనియర్ డాక్టర్లు, పీజీలు

ప్రత్యామ్నాయ చర్యలపై వైద్యాధికారులు

హౌస్‌సర్జన్లు, పీజీలు నిరవధిక సమ్మెకు వెళుతుండటంతో జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేందుకు వైద్యాధికారులు అడుగులు వేస్తున్నారు. సమ్మె నోటీస్ ఇచ్చిన వెంటనే వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు, ఆయా విభాగాల హెచ్‌ఓడీలతో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు ఎలా అందించాలి? అందుకు ఎవరిని అలార్ట్ చేయాలని ఆలోచించారు. 29మంది సర్వీస్ పీజీలు, ఆరుగురు సీనియర్ రెసిడెంట్స్‌తో వైద్య సేవలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటికీ ఇబ్బంది ఏర్పడితే ఐఎంఏ సహకారంతో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులను, నర్సింగ్ కళాశాలల స్టూడెంట్స్‌ను తీసుకొని వైద్య సేవలు అందించేలా చూస్తామని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ తెలిపారు. ఈసమస్య తెగే వరకు హెచ్‌ఓడీలు ఆస్పత్రిలో ఎక్కువ సమయం ఉండాలిని, రోగులకు అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. జూనియర్‌డాక్టర్లు, పీజీలు సమ్మెకు దిగడంతో వైద్యసేవలపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే దగ్గుపాటి ఇంట్లో వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 16: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఇంట్లో శుక్రవారం ఘనంగా వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఎమ్మెల్యే సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మీ, భర్తతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో సందడి వాతావరణం నెలకొంది. శ్రీలక్ష్మీ మహిళలకు పసుపు, కుంకుమ వాయనం ఇచ్చారు. నియోజకవర్గం ప్రజలందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే దంపతులు ఆకాంక్షించారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



కుటుంబ సభ్యులతో కలసి వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఆగస్టు 16: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆకాంక్షించారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు లక్ష్మీదేవి ఆశీస్సులతో సిరి సంపదలతో తులతూగాలని పూజలు చేశారు.

నిర్బంధ వసూళ్లు, బెదిరింపులను అరికట్టాలి

● ఎస్పీకి ప్రభాకర్ చౌదరి వినతి



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఆగస్టు 16: ఎన్నడూలేని విధంగా అనంతపురం నగరంలో అనేక రకాల నిర్బంధ వసూళ్లు, బెదిరింపుల పర్వం మొదలైందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి.. ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీని ఆయన కలిసి పలు అంశాలను వివరించారు. ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ.. నగరంలో స్థానికేతరులు తిష్టవేసి అరాచకశక్తులను చేరదీసి, కొందరు పార్టీ కార్యకర్తలు, నాయకులు లక్ష్యంగా చేసుకొని మద్యంమత్తులో దుర్భాషలాడుతూ బెదిరిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. ప్రతి విషయంలోనూ రాజకీయ జోక్యం అధికమైందని, స్థానికేతరులు అరాచక వక్తులు ముఠాగా ఏర్పడి, అధికారం అనే ఆయుధం బూచిని చూపిస్తూ వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని, వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఇతర వ్యక్తులను బెదిరించే సంస్కృతికి శ్రీకారం చుట్టారన్నారు. బుల్లె మాధవి సెల్ నెంబర్ 9550876573 డేటా సంభాషణలను పరిశీలిస్తే, ఆమెను ఎవరు బెదిరించారు..? వారి బంధుగణం ఎవరు తదితర విషయాలు బయటకు వస్తాయన్నారు. 1983 నుంచి 40 సంవత్సరాల తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో మచ్చలేని జీవితం తనదన్నారు. తాజాగా నగరంలో జరుగుతున్న పలు సంఘటలపై నిష్పక్షపాతంగా విచారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియను పూర్తిచేయాలి



సహకార పరపతి సీఈఓతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురంరూరల్, ఆగస్టు 16: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సంబంధించి ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియను సెప్టెంబరు ఆఖరిలోపు పూర్తిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రాచానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియను చేపడుతున్నారన్నారు. జిల్లాలో ఉన్న 58 సంఘాలు ఈ ప్రక్రియను గడువులోగా చేపట్టాలన్నారు. డీసీఓ అరుణ కుమారి, డీపీఓ ప్రభాకర్‌రావు, సంఘం సీఈఓ శ్రీనివాసులు, డీసీసీబీ సీఈఓ స్వరూపారాణి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు వీరాంజనేయులు మృతి



అనంతపురం అర్బన్, ఆగస్టు 16: కూడేరు మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకుడు వీరాంజనేయులు (62) మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయన 26 రోజులుగా అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు. వీరాంజనేయులు మృతి పార్టీకి తీరని లోటన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సీపీఎం సంతాపం

అనంతపురం కల్చరల్: టీడీపీ నాయకుడు వీరాంజనేయులు మృతికి సంతాపం వ్యక్తం చేసినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ నిబద్ధత కలిగిన రామాంజనేయులు తాను నమ్మిన తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పని చేశారన్నారు. ఇతర పార్టీలపట్ల ముఖ్యంగా సీపీఎం పట్ల ఎంతో గౌరవంతో, అందులో పనిచేసే వ్యక్తులపట్ల అభిమానంగా, స్నేహభావంతో మెలిగేవారన్నారు.

బోయసంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పోతులయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16: ఏపీ వాల్మీకి బోయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా జింకల పోతులయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతినాయుడు మంగళవారం పోతులయ్యను ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో కూటమి ప్రభుత్వం సహకారంతో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

టీవీ-5 కెమెరామన్ శేఖర్‌కు నివాళి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు16: టీవీ-5 కెమెరామెన్ శేఖర్ మృతికి పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో శేఖర్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ శేఖర్ కెమెరామెన్‌గా విశిష్ట సేవలందించారన్నారు. అలాంటి వ్యక్తి గుండెపోటుతో మరణించడం జర్నలిస్టు లోకానికి తీరని లోటన్నారు. సభలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సురేష్‌కుమార్, టీవీ-9 నరేష్, టీవీ-5 చంద్రశేఖర్, ఈటీవీ ప్రసాద్, హెచ్‌ఎంటీవీ పయ్యావుల ప్రవీణ్, ఎన్‌టీవీ శీనా, 10-టీవీ జగదీష్, ఆర్‌టీవీ నాయుడు, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ నాయకులు రసూల్, ఈటీవీ కెమెరామన్ నారాయణ, టీవీ-9 కెమెరామన్ విజయ్, ఏబీఎన్ కెమెరామన్ గోవర్ధన్, ఎన్‌టీవీ కెమెరామన్ సుదర్శన్, పాత్రికేయులు ప్రతాప్, సి.రవికుమార్, డేనియల్, కమల్, సుధాకర్, దాదు, కేశవ, శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్, కుమార్‌స్వామి, స్ట్రింగర్లు అనిల్ పాల్గొన్నారు.



కెమెరామన్ శేఖర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జర్నలిస్టులు

కరుణించమ్మా... వరలక్ష్మీమాత..!

● వైభవంగా వరలక్ష్మీవ్రతాలు



అలంకరణలో కొత్తూరు కన్యకాపరమేశరి అమ్మవారు



పాతవూరులో...



కనకదుర్గాభవాని ఆలయంలో వరలక్ష్మీ మాత

అనంతపురం కల్చరల్, ఆగస్టు 16: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఇళ్లలో వరలక్ష్మీ వ్రతం చేసే సంప్రదాయం లేనివారు సమీప ఆలయాల్లో వ్రతాలను ఆచరించారు. జిల్లాకేంద్రంలో కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయాన్నే వాసవీమాతకు పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను ఆచరిస్తుండగా... పురోహితులు వేదమంత్రాలు వల్లించడంతోపాటు వ్రతవిధానాన్ని భక్తులకు వివరించారు. అమ్మవారిని స్వర్ణకవచ చీరతో విశేషంగా అలంకరించి పూజలు గావించారు. ఐదో రోడ్డు కనకదుర్గ ఆలయంలోనూ వరలక్ష్మీ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, చౌడేశ్వరి దేవాలయం, పాతూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి, మహాలక్ష్మి ఆలయం, రామ్‌నగర్‌లోని పెద్దమ్మ దేవాలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.



వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సామూహిక ఒడిబియ్యం



మహిళలకు సామూహిక ఒడిబియ్యాలు నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు16: మండలంలోని బసంపల్లి కైవారం సద్గురు యోగినారేయణ తాతయ్య ఆశ్రమంలో ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు శుక్రవారం సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని ఆశ్రమంలో ముత్తైదువులకు ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. 50 మంది మహిళలకు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ప్రైవేట్ స్కూళ్ల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి బొకే అందజేస్తున్న ప్రైవేటు స్కూళ్ల సంఘం నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 16: ప్రైవేట్ స్కూళ్ల సమస్యలు పరిష్కరించాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను అపుస్మా నాయకులు కోరారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంత్రిని వారు కలిశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి, సెక్రటరీ చంద్ర ఇతర నాయకులు మాట్లాడుతూ బడ్జెట్ స్కూళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రికి వినతిపత్రం అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సంఘం నగర అధ్యక్షుడు శ్రీనాథ్, రవిశంకర్ ప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, అన్వర్ జలీల్, రామూర్తి, లక్ష్మణ్, లోక్‌నాథ్, రామ్మోహన్, సంజీవరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎస్ఈగా సూర్యనారాయణ

అనంతపురం క్రైం,ఆగస్టు 16: నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగ ఇన్‌చార్జి ఎస్ఈ(ఎఫ్ఏసీ)గా సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఉన్న ఇన్‌చార్జి రామమోహన్‌రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ నగరపాలికలో ఈఈగా పనిచేస్తున్న సూర్యనారాయణకు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఈకి ఈఈలు, డీఈలు, గ్రామ, వార్డు సచివాలయం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలియజేశారు.

జూదరుల అరెస్ట్

అనంతపురం క్రైం, ఆగస్టు 16: నగరంలో పేకాట ఆడుతున్న పది మందిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. కమలానగర్‌లో జూదమాడుతున్న 10మందిని అరెస్ట్ చేసి రూ.30వేలు స్వాధీనం చేసుకున్నారు.

కరెంటు కోతలు లేకుండా చూడండి

శింగనమల, ఆగస్టు 16: మండలంలో ఇష్టారాజ్యాంగా కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులకు గురివుతున్నారని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం శింగనమల సబ్ స్టేషన్‌లో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వెంకటేశ్, శంకరనారాయణ, బండివెంకటనారాయణ కరెంట్ కోతలపై అధికారులకు వినతి పత్రం అందజేశారు.

పాండురంగస్వామి నిజపాద దర్శనం



అలంకరణలో స్వామి అమ్మవార్లు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 16: శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద దర్శనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివార్ల మూలవిరాట్‌లకు ఫలపంచామృతాభిషేకాలు చేయడంతోపాటు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు మొక్కుకున్నారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో 117 రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు మంత్రి కేశవ్‌ను కోరారు. శుక్రవారం వారు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆర్థికశాఖమంత్రి కలిశారు. నాయకులు మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేయాలని కోరారు. ఇంగ్లీష్ మీడియంతోపాటు సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. టీచర్ల సర్దుబాటుకు ముందే ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందించారు. సంఘం రాష్ట్ర పూర్వపు కార్యదర్శి నరసింహులు, రఘురాంరెడ్డి, రాయల్ వెంకటేష్, భాస్కర్, సతీష్ కుమార్, ఓబులేసు, వన్నప్ప, రమణ, రామకృష్ణ, సూర్యనారాయణ, అడవిరాజు, తిప్పేస్వామి, కిషోర్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి పురస్కార గ్రహీతకు సన్మానం



జైలు సూపరింటెండెంట్ రహిమాన్‌ను సన్మానిస్తున్న ఓపెన్‌ఎయిర్ జైలు సూపరింటెండెంట్

బుక్కరాయసముద్రం, ఆగస్టు 16: అనంతపురం జిల్లా జైలు సూపరింటెండెంట్ షఫివుర్ రహిమాన్‌కు రాష్ట్రపతి పురస్కారం వచ్చిన సందర్భంగా జిల్లాజైలు సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. జైలు విభాగంలో అంకితభావంతో పనిచేసినందుకు రాష్ట్ర జైళ్ల శాఖ జిల్లా జైలు సూపరింటెండెంట్ సేవలు గుర్తించి రాష్ట్రపతి పురస్కార అవార్డును గురువారం విజయవాడలో జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసురావు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. జిల్లా జైలులో నిర్వహించిన కార్యక్రమంలో ఓపెన్‌ఎయిర్ జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగి విధినిర్వహణలో మంచి గుర్తింపు రావడం చాలా కష్టమన్నారు. జైలర్ నాగరాజు, డిప్యూటీ జైలర్లు హరీష్, చంద్రశేఖర్, వైద్యాధికారి వినోద్ పాల్గొన్నారు.

అనంతపూర్ క్లబ్‌లో ఆర్డీఓ, తహసీల్దార్ విచారణ

● రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16: అనంతపూర్ క్లబ్‌లో ఆర్డీఓ, తహసీల్దార్ విచారణ చేపట్టారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అందరి దృష్టి అనంతపూర్ క్లబ్‌పైనే అనే కథనానికి కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి ఎన్నికల అధికారి జారీచేసిన ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. ఈనెల మొదటి వారంలో క్లబ్ ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేస్తూ, విచారణ చేసి సమగ్ర నివేదిక అందజేయాలని ఆర్డీఓను ఆదేశించారు. గత వారంలో కో-ఆపరేటివ్ సబ్ డివిజనల్ అధికారి బాలగంగాధర్ గురువారం క్లబ్‌ను సందర్శించి క్లబ్ సభ్యులు, ఓటర్ల జాబితాపై వివరాలు సేకరించారు. ఆర్డీఓ వసంతబాబు, తాహసీల్దార్ హరికుమార్ శుక్రవారం క్లబ్‌ను సందర్శించి ప్రస్తుత సెక్రటరీ కేశవరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి నుంచి ఓటర్ల జాబితా, ఆర్డినరీ మెంబర్, లైఫ్ మెంబర్ల వారిగా వివరాలు సేకరించారు. పైగా ఆర్డినరీ మెంబర్లు ప్రతి నెలా కట్టాల్సిన మొత్తాన్ని పెండింగ్‌లో ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఆర్డినరీ మెంబర్లకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా ఎన్నికలకు వెళ్లడం క్లబ్ నిబంధనలకు విరుద్ధమనే అంశాన్ని సేకరించారు. సేకరించిన వివరాలను కలెక్టర్, క్లబ్ ఛైర్మన్ వినోద్‌కుమార్‌కు రెండు రోజుల్లో నివేదిక అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు.

వాంగ్మూలం రికార్డు చేసిన అధికారులు: ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో పాటు పలు ఆధారాలతో జిల్లా కలెక్టర్, క్లబ్ ఛైర్మన్‌కు ఇద్దరు సభ్యులు రజాక్, లక్ష్మన్న ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఇద్దరు సభ్యుల నుంచి వివరాలు సేకరించి, విచారణ అధికారి ఆర్డీఓ, తాహశీల్దార్ వాంగ్మూలం రికార్డు చేశారు. ప్రస్తుత పాలకవర్గం 2022 జూన్ 1వ తేదీన బాధ్యతలు స్వీకరించారని, రెండేళ్ల పదవీకాలంలో 2024 మే 30వ తేదీలో ముగిసింది. దీంతో కచ్చితంగా ఎన్నికలు నిర్వహించాలని సభ్యులు వాంగ్మూలంలో పేర్కొన్నారు. అంతేగాక ఓటర్ల జాబితాలో గోల్‌మాల్‌పై ఆధారాలు ఇచ్చారు. ఆర్డినరీ మెంబర్ నుంచి లైఫ్ మెంబర్ కోసం తాను చెల్లించిన రూ.10వేలను గతంలో పనిచేసిన పాలకవర్గం దుర్వినియోగం చేసి, తనకు రసీదు ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయాలను సభ్యులు ఇద్దరూ విచారణ అధికారుల వద్ద వివరించారు.

వైద్యురాలి హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 16: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో వైద్యురాలిని అత్యాచారం చేసి, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ సీపీఐ, ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ చేసి నిరసన తెలిపారు. నగరంలోని పాతూరు గాంధీ విగ్రహం దగ్గర కొవ్వొత్తులు ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ... ట్రైనీ డాక్టర్‌పై జరిగిన సామూహిక అత్యాచారం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మెడికల్ కాలేజ్‌లో అర్ధరాత్రి వరకూ డ్యూటీ చేసిన తర్వాత విశ్రాంతి తీసుకోడానికి వెళ్లిన ఆమె ఉదయం నగ్నశవంగా కనిపించిందన్నారు. తల్లిదండ్రులు, తోటి డాక్టర్లు సమ్మెకు దిగితే కానీ పోస్టుమార్టం చేయలేదని, ఆత్మహత్యగా చిత్రీకరించాలని చూశారంటూ మండిపడ్డారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు రమణ, అల్లిపీరా, సంతోష్‌కుమార్, చాంద్‌బాషా, సుందర్‌రాజు, ప్రసాద్, మునాఫ్, శ్రీనివాస్, రహంతుల్లా, యశోదమ్మ, చందు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి: కోల్‌కతాలో విధుల్లో ఉన్న డాక్టర్‌పై అత్యాచారం చేసి, హతమార్చిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘం కోశాధికారి హనుమంతు, సాయి స్వరూప, రాధాజ్యోతి, మంజునాథ్, ఉమమహేష్, వంశీ పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం క్లాక్‌టవర్: కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్‌ను అత్యంత అమానుషంగా అత్యాచారం చేసి హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని స్త్రీవిముక్తి సంఘటన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ, లక్ష్మి డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్ హత్యాకాండపై సమగ్ర విచారణ జరిపి నేరస్థులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలపై హింసను ప్రేరేపించే మద్యం, మత్తు పదార్థాలు, పోర్న్ వెబ్‌సైట్లను నిషేధించాలన్నారు. దాడికి నిరసనగా 17వ తేదీ నుంచి 24గంటల పాటు వైద్యసేవలను నిలిపివేయాలని ఐఎంఏ పిలుపునకు సంఘీభాన్ని తెలిపారు.

వైభవంగా శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 16: మండలంలోని చిన్నపల్లి గ్రామంలో శ్రీరామచంద్ర ఆలయంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రెండో రోజు అభిషేకాలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. శనివారం ఉదయం సీతారామలక్ష్మణ హనుమాన్‌సమేత శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఎమ్మెల్యే పరిటాలసునీత పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా ఆలయాన్ని నిర్మించి పెద్దఎత్తున విగ్రహప్రతిష్ఠ నిర్వహించడం పట్ల గ్రామస్థులను ఆమె అభినందించారు. టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, దండుఓబిలేసు, అంకే అమరేంద్ర పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన యల్లమ్మ అమ్మవారి ఆలయంలో వరలక్ష్మి వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే పరిటాలసునీత పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత



వరి నాట్లు వేసేందుకు సిద్ధం అవుతున్న ఎమ్మెల్యే పరిటాలసునీత

రామగిరి, ఆగస్టు16: తన వ్యవసాయక్షేత్రంలో ఎమ్మెల్యే పరిటాలసునీత శుక్రవారం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో తన పొలంలో వరినాట్లు వేసేందుకు పూజలు చేసి ఉత్సాహంగా కూలీలతో కలిసి పనిచేశారు. ఆమె మాట్లాడుతూ తమ కుటుంబానికి మొదటి నుంచి వ్యవసాయం అంటే చాలా ఇష్టమని, పరిటాలరవి ఉన్నప్పుడు ఎక్కువగా పొలం పనుల్లో ఉండేవాళ్లమని గుర్తుచేసుకున్నారు.

రాప్తాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

● టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



బోడమల్లయ్య స్వామి కాపులతో పరిటాల శ్రీరామ్

రాప్తాడు, ఆగస్టు 16: రాప్తాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని బోడమల్లయ్య స్వామి ఆలయానికి జాతీయరహదారి వద్ద నుంచి ఆలయం వరకూ తారు రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరు చేయించి శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. తారు రోడ్డు నిర్మాణానికి హాజరైన పరిటాల శ్రీరామ్‌కు బోడమల్లయ్య స్వామి కాపులు, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పరిటాల శ్రీరామ్ స్వామికి పూజలు నిర్వహించి తారు రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి ఆలయానికి రోడ్డు సమస్య ఉందని, ఈ సమస్యకు ఎమ్మెల్యే పరిటాల సునీత పరిష్కారం చూపారన్నారు. మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ శీనయ్య, జాఫర్, రవి, గంగలకుంట రమణ, నంబూరి రమణ, ప్రతాప్, మధు, పార్థసారథి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ఢిల్లీ, ఒడిశా జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ఢిల్లీ, ఒడిశా జట్లు విజయం సాధించాయి. జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2024-25 పోటీలు శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో కొనసాగాయి. ఉదయం జరిగిన పోటీల్లో మిజోరాం జట్టుపై ఒడిశా విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ జట్టుపై ఢిల్లీ జట్టు గెలుపొందింది. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యం, గెలుపోటముల ప్రభావంపై వివరించారు. గెలిచిన జట్లను అభినందించారు. ఆర్డీటీ ఫైనాన్స్ డైరెక్టర్ సంజీవ్‌సంగ్మా, సప్తగిరి క్యాంఫర్ ప్రతినిధి హనీఫ్, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి బి మల్లేష్, శ్రీనివాస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 16: జాతీయ ఉద్యమ నాయకులపై పురావస్తుశాఖ మ్యూజియం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ మహుమతిని సాధించారు. ప్రిన్సిపాల్ శంకరయ్య విద్యార్థులు నందు, చందనా, ప్రియ, దీపికలను అభినందించి బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ పీఓలు ముస్సీన బేగం, రామకృష్ణ, శివ శంకర్, అంజనరెడ్డి, అధ్యాపకులు మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 16: బీజేపీ రాష్ట్ర నాయకుడు, సీఆర్ఐటీ కళాశాల అధినేత చిరంజీవిరెడ్డి సక్షమ్ కేంద్ర నిర్వహణకు రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం సక్షమ్ సేవాకేంద్రాన్ని సందర్శించిన చిరంజీవిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులతోకలిసి కేంద్ర నిర్వాహకురాలు లలితమ్మకు చెక్కును అందించారు.

రేపు గద్దర్ వర్ధంతి సభ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 16: ప్రజాయుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభను 18న జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి పేర్కొన్నారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుకు నడిచేలా గద్దర్ తన ఆటపాటలతో చైతన్యవంతులను చేశారన్నారు. నాయకులు కేపీ రాజు, సుగమంచి శ్రీనివాసులు, ఉమామహేశ్వరి, రామాంజనేయులు పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత కరెంట్ వరం

శింగనమల, ఆగస్టు 16: రాష్ట్రంలో చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వడం వరమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. శుక్రవారం చేనేత కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి నేసే మధు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలసి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులు మాట్లాడుతూ ఉచిత కరెంటు కోసం ప్రతి కార్మికుడికి ప్రత్యేక మీటర్ ఇవ్వాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

గార్లదిన్నె, ఆగస్టు 16: మండలంలోని కోటంక గ్రామంలో చౌకబియ్యాన్ని గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అనంతపురానికి చెందిన మహేష్ నాయక్, టిప్పుసుల్తాన్ అనే ఇద్దరు కోటంక గ్రామంలో 28 క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో అనంతపురం వైపు తరలిస్తుండగా గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గౌస్ మహమ్మద్, సిబ్బంది కోటంక గ్రామానికి చేరుకుని రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిని, ఆటోను ఆదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ బండారు ఈరమ్మ పట్టుబడిన రేషన్ బియ్యంపై పూర్తి విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పందుల అపహరణ

మండలంలోని పెనకచెర్ల గ్రామంలో ఎరికల వెంకటేసుకు చెందిన 40 పందులను గురువారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. వెంకటేసు పందులను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం దుండగులు లగేజీ బొలెరో వాహనంలో వచ్చి గ్రామ సమీపంలో ఉన్న పందులను ఎత్తుకెళ్లారు. అడ్డుకున్న వెంకటేసు, శ్రీనివాసులను రాళ్లతో కొట్టి పరారయ్యారు. రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైభవంగా గోపుర కలశ ప్రతిష్ఠ

బొమ్మనహాళ్, ఆగస్టు 16: మండలంలోని గోవిందవాడ గ్రామంలో సుంకలమ్మదేవి ఆలయ గోపురంపై శుక్రవారం కలశ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. రెండురోజులపాటు విశేషపూజలు జరిపించి కలశాన్ని ప్రతిష్ఠించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం నమోదు చేసుకోండి: ఏఓ

గుంతకల్లుటౌన్, ఆగస్టు16: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఖరీఫ్ 2024లో పంట సాగు చేయని రైతులకు సబ్సిడీతో ప్రభుత్వం ఇవ్వనున్న ప్రత్యామ్నాయ విత్తనాల కోరకు పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే స్వాతి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని రైతు సేవ కేంద్రంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో కొర్రలు, ఉలవలు, పెసర విత్తనాలు ఇస్తోందన్నారు. విత్తనాలు కావల్సిన రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

పశుబీమాను సద్వినియోగం చేసుకోండి

బెళుగుప్ప, ఆగస్టు 16: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. పశువులకు రెండేళ్ల, గొర్రెలు, మేకలకు ఆరునెలలు పైబడి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు తమను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రెవెన్యూ సదస్సులపై సమీక్ష

గుత్తి, ఆగస్టు16: మండలంలో సెప్టెంబరు 1నుంచి రెవెన్యూ సదస్సులను పక్కాగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లతో సమక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులకు ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలన్నారు. ఏ సమస్య వచ్చినా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, దాని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఓబులేసు, ఆర్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సీఐ వెంకటరమణ

రాయదుర్గం, ఆగస్టు 16: రూరల్ సీఐగా కే వెంకట రమణ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను రాయదుర్గం రూరల్‌కు బదిలీ చేశారు. ఈ స్థానంలో ఉన్న ప్రసాద్‌బాబును చిత్తూరు జిల్లా వాయల్పాడు సీఐగా బదిలీ చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని సీఐ వెంకటరమణ తెలిపారు. అనంతరం మురడి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉరవకొండలో వర్షం

ఉరవకొండ, ఆగస్టు16: పట్టణంలో శుక్రవారం వర్షం కురిసింది. సుమారు గంట పాటు వర్షం పడింది. దీంతో పాత బస్టాండ్, టవర్ క్లాక్ కూడలిలో వర్షం నీరు నిలవడంతో వాహన చోదకులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూరగాయల వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాం గణంలోకి వర్షపునీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో కాలనీలు జలమైమయ్యాయి. గత రెండ్రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు ఎండిపోతున్న ఆముదం కంది పంటలకు ఊరట కలిగించింది.

బెళుగుప్ప: మండలంలో గురువారం రాత్రి 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మూడు రోజుల నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుండటంతో కంది పంటసాగుచేసిన రైతులతోపాటు నల్లరేగడి భూములు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

కుందుర్పి: మండల పరిధిలోని ఎనుములదొడ్డి గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి బీసీ కాలనీలోని పలు ఇళ్లల్లోకి వర్షపునీరు చేరింది. దీంతో రాత్రంతా నీరు బయటకు తోడిపోస్తూ జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇళ్లలో ఉంచుకున్న నిత్యవసర సరుకులు దుస్తులు వర్షానికి తడిసిపోయాయన్నారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ నాయకుల దాడి

● తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త


గాయపడిన హరికృష్ణ

పామిడి, ఆగస్టు 16 : మండలంలోని రామగిరి గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ వర్గీయులపై వైసీపీ నాయకులు దాడి చేశారు. స్థానికులు, బాధితులు తెలిపిన మేరకు.. రామగిరి గ్రామంలో చిన్నపిల్లలు ఆడుకుంటూ గొడవ పడ్డారు. అది కాస్త పెద్దల గొడవకు దారి తీసింది. పాతకక్షలను దృష్టిలో పెట్టుకున్న వైసీపీ నాయకులు పిల్లల గొడవను అడ్డుపెట్టుకొని టీడీపీ వర్గీయులైన హరి, లక్ష్మి దంపతులపై మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న హరి తమ్ముడు హరికృష్ణ అన్న ఇంటికి వెళ్తుండగా వైసీపీ నాయకులు కొడవళ్లు, గొడ్డలి, కర్రలతో దాడి చేయడంతో తీవ్రరక్తగాయాలపాలయ్యాడు. అతడిని స్థానికులు 108 వాహనంలో పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిపై సీఐ రాజశేఖర్‌రెడ్డిని సంప్రదించగా ఆయన స్పందించలేదు.

పాముకాటుతో మహిళ మృతి

కూడేరు, ఆగస్టు 16: మండల పరిధిలోని కొర్రకోడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి (28) వరినాట్లు వేస్తూ పాముకాటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. ఆదిలక్ష్మి అనే కూలీ శుక్రవారం ఉదయం వరినాట్లు వేయడానికి పనికి వెళ్లింది. నాట్లు వేస్తుండగా పాముకాటు వేయడం తో చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబంలో భార్య మృతి చెందడంతో భర్త రమేష్, ఇద్దరు కూతుళ్లు బోరున విలపించారు. తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పామిడి, ఆగస్టు 16: మండలంలోని గజరాంపల్లి సమీపాన 44వ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తహీర్ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న చాంద్ బాషా కుమారుడు తహీర్ గుత్తి నుంచి పామిడికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. గజరాంపల్లి సమీపాన ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో తహీర్ తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించిన హైవే అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో గుంతకల్లులో వాసవీమాత, గుత్తిలో వాసవీమాత


బూదిగుమ్మలో పద్మావతీదేవి


ఉరవకొండలో దుర్గాభవాని

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

వరలక్ష్మి వత్రాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణాలతో పాటు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో మూలవిరాట్లకి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. మహిళలు ఆలయాలకు పెద్దఎత్తున తరలివచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. పలు ఆలయాల్లో తీర్థ ప్రసాదవినియోగం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఇళ్లలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. గుంతకల్లు, గుత్తి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి తదితర పట్టణాలతో ఆయా నియోజకవర్గాల వ్యాప్తంగా వరలక్ష్మీవ్రతం నిర్వహించారు.


తాడిపత్రిలో వాసవీమాత


రాయదుర్గంలోని మహాలక్ష్మి


చింతల వెంకటరమణస్వామి ఆలయంలో సామూహిక వ్రతంలో పాల్గొన్న మహిళలు


తాడిపత్రి వేదగాయత్రీమాత


సామూహిక వరలక్ష్మీ వత్రం

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే కాలవ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 16: రాజకీయాలకు అతీతంగా ప్రజారంజక పాలన అందించాలంటే అందరి సహకారం అవసరమని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తాము 2014 నుంచి 2019 వరకు వేలకోట్ల నిధులు తెచ్చి పంచాయ తీలను అభివృద్ధి చేశామన్నారు. అయితే గత ఐదేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. వేలకోట్ల రూపాయల పంచాయతీ నిధులను అప్పటి ప్రభుత్వం దారి మళ్లించడంతో పంచాయతీ పాలన అస్తవ్యస్తమైందన్నారు. రాత్రికి నిధులు ఖాతాలోకి వేసినట్లు చూపిస్తూ తెల్లారేసరికి ఖాళీఖాతా చూపించడం గత ప్రభుత్వానికే చెల్లిందన్నారు. గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులు లేక సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే త్వరలోనే రూ. 20 కోట్ల నిధులతో మండలంలో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. వచ్చే ఆరునెలల్లోగా రూ. 35.40 కోట్ల పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిపారు. అధికారులు ప్రజలకు సహకరించి మంచి సేవలను అందించాలన్నా రు. గ్రామపంచాయతీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం సర్పంచులు వన్నూరుస్వామి, మల్లేశప్పరప్ప, రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి, రాదమ్మతో పాటు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఎంపీపీ విద్యావతి శాలువాలు, పూలమాలలతో ఎమ్మెల్యేని సత్కరించారు. తహసీల్దార్ రఘు, ఏఓ మహేంద్ర, హార్టికల్చర్ అధికారి మౌనిక, జడ్పీటీసీ మల్లికార్జున, ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్, వైద్యులు సూర్యనారాయణరెడ్డి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకదశ

రాయదుర్గం: విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ కీలకదశ అని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల కళాశాలలో శుక్రవారం జరిగిన ఫ్రెషర్స్‌డే సెలబ్రేషన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చదువుపై తప్ప వేరే వ్యాపకాలకు తావివ్వకుండా ధ్యాస పెట్టి విద్యాభ్యాసాన్ని సాగించాలన్నారు. భవిష్యత్‌లో అవకాశాలు ఉన్న రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. నిరంతరం కష్టపడే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయభాస్కర్, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్, డీ హీరేహాళ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

బొమ్మనహాళ్, ఆగస్టు 16: మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని దర్గాహొన్నూరులో ఓ ఇల్లు పూర్తిగా నేలమట్టం అయింది. మట్టి మిద్దె కావడంతో శుక్ర వారం తెల్లవారుజామున ఒక్కసారిగా కుప్పకూ లింది. ఆ సమయంలో ఇంటి యజమానులు వన్నళ్లి సన్నీడు, వంద్రక్క తమ ఇద్దరి మనుమళ్లతో ఆ ఇంటికి పక్కనే ఒక పక్క మంచంపై పడుకుని ఉండ డంతో పెనుప్రమాదం తప్పింది. ఇల్లు కూలడంతో సుమారు రూ. 5 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు వారు తెలిపారు. వారి ఇద్దరు కుమారులు వెంకటేశు, చంద్ర కూలీ పనుల కోసం హైదరాబాద్ ప్రాం తానికి వలస వెళ్లారు. దీంతో వారు తమ ఇద్దరు మనవళ్లను ఇంటి వద్దనే ఉంచుకొని స్థాని కంగా కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. టీడీపీ నాయకులు కేశప్ప, నాగరాజు, ముక్కన్న బాధితులను పరామర్శించి, తహసీల్దార్ మునివే లుకు సమాచారం అందించారు. వీఆర్వో రామన్న కూలిన ఇంటిని పరిశీలిం చారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తహసీల్దార్‌తో మాట్లాడి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందిస్తామని కేశప్ప బాధితులకు భరోసా ఇచ్చారు.

ఉచిత శిక్షణ

ఉరవకొండ, ఆగస్టు16: మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అస్రఫ్అలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్‌సెంటర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్‌తో పాలు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు.

నిర్మాణదశలోనే నేలకొరిగిన విద్యుత్ లైన్


బసంపల్లి వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 16 : కేంద్ర ప్రభుత్వం నిధులతో ఆర్డీఎస్ పథకం ద్వారా మండలకేంద్రమైన శెట్టూరు నుంచి బసంపల్లికి నూతనంగా విద్యుత్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. అయితే నిర్మాణ దశలోనే చిన్నపాటి వర్షానికే స్తంభాలు నేలకొరిగిపోతున్నాయి. గురువారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి బసంపల్లి సమీపంలోని ఓ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. నాసిరకం పనులు చేపడుతూ, విద్యుత్ స్తంభాలను నిబంధనల ప్రకారం కాకుండా పైపైనే నాటడంతోనే నేలకొరిగిందని బసంపల్లి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హగరిలో రహదారి ఏర్పాటుకు ఎమ్మెల్యే హామీ

కణేకల్లు, ఆగస్టు 16: మండలకేంద్రమైన కణేకల్లు - మాల్యం గ్రామాల మధ్య ఉన్న వేదావతి హగరిలో తెగిన రహదారి పునరుద్ధరణకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చినట్లు టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ కన్వీనర్ ఆనంద్‌రాజ్ తెలిపారు. వరద ఉధృతికి తెగిన రహదారిని టీడీపీ నాయకులు గురువారం పరిశీలించారు. రహదారి లేకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా హగరిలో రహదారి ఏర్పాటు చేసి, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు బీటీ రమేష్, షేక్‌ముజ్జు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

11 కేవీ విద్యుత్‌లైన్‌ను మార్చాలి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 16: మండలంలోని బీఎస్‌హళ్లి మధ్యలో 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్లడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షుడు కాటా వెంకటేశులు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. గ్రామం మధ్యలో ఒకే స్తంభం నుంచి గ్రామానికి సంబంధించిన ఎల్‌టీ లైన్, 11 కేవీ విద్యుత్‌లైన్ వెళ్తుండడంతో వర్షం వచ్చినప్పుడల్లా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ అవుతోందన్నారు. గతంలో రెండు కుక్కలు, రెండు లేగదూడలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాలవ స్పందిస్తూ సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకునేలా ఆదేశాలిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కుళ్లాయప్ప, ప్రకాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల చోరీపై ఫిర్యాదు

ఉరవకొండ, ఆగస్టు16: మండలంలోని రాకెట్ల గ్రామం పరిసర ప్రాంతాల్లో హంద్రీనీవా కాలువ, హెచ్చెల్సీ కింద సాగవుతున్న వ్యవసాయ పొలాల్లోని మోటార్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఆర్నెల్ల నుంచి వరుసగా చోరీలు జరుగుతున్నాయి. ఇప్పటికే గ్రామానికి చెందిన 29మంది రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, కేబుల్‌ను ఎత్తుకెళుతున్నారు. వ్యవసాయ మోటార్ల పరికరాల చోరీపై రైతులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు16: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, విద్యార్థినుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అజంతా సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.



గుత్తిలో శాంతిర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు



తాడిపత్రిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

బంగ్లాదేశ్‌లో దాడులకు నిరసనగా శాంతి ర్యాలీ

గుత్తి, ఆగస్టు16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ కూటమి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రాజీవ్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా టీడీపీ గుత్తి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో మైనార్టీలు, హిందూవులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. టీడీపీ నాయకులు ఎంకే చౌదరి, సంపత్‌కుమార్, సుంకన్న, రామకృష్ణ, బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, బాలకృష్ణ, ఓబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణంలో శుక్రవారం సాయంత్రం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గాంధీకట్ట, నవరంగ్‌టాకీస్ రోడ్డు, పోలీస్‌స్టేషన్‌రోడ్డు మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగనాథ్‌రెడ్డి, గంగాధర్, శింగరి లక్ష్మినారాయణ, రామాంజనేయులు, ఆంజనేయులు, రాధాకృష్ణ, శేషఫణి, రాజా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతే ధ్యేయం

ఎమ్మెల్యే అమిలినేని


ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఆగస్టు 16: పచ్చదనంతోపాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని గ్రామీణ ప్రాంతాల్లో కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వచ్ఛ శానిటేషన్ పథకం ట్రాక్టర్లను పంచాయతీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వచ్ఛమైన పరిశుభ్ర వాతావ రణం కల్పించేందుకు ఆయాశాఖల అధికారులు కృషిచేయాలన్నారు. ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. కళ్యాణదుర్గం మండలంలోని ఏడు పంచాయతీలకు ఏడు, కంబదూరులో ఐదు పంచాయతీలకు ఐదు ట్రాక్టర్లను ఎమ్మెల్యే అందజేశారు. త్వరలో మిగిలిన మండలాలకు అందిస్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సుప్రారంభం : స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన కళ్యాణదుర్గం - బళ్లారి పల్లెవెలుగు కొత్తబస్సును శుక్రవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రజావేదిక వద్ద పూజలు చేసి ప్రారంభించారు. ఆర్టీసీ బస్సులోనే ప్రతి ఒక్కరు ప్రయాణించాలని సూచించారు.

వర్షం కోసం పూజలు

గుంతకల్లుటౌన్, ఆగస్టు16: మండలంలోని కదిరిపల్లిలో శుక్రవారం వర్షం కోసం గంగమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామస్థులు పెద్దమ్మ గుడి నుంచి గంగమ్మ దేవాలయం వరకు ఇంటింటినుంచి బోనాలు తీసుకెళ్లి గంగమ్మకు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ గంగమ్మకు పూజలు చేశారు.

యాడికి: వర్షం కురిసేలా చేయాలని కోరుతూ శుక్రవారం వేములపాడు గ్రామంలో పలువురు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేములపాడు గ్రామానికి చెందిన ముస్లింలు సామూహికంగా స్థానిక మరువ వంక వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక ఎక్కువమంది రైతులు పంటలు సాగు చేయలేకపోయారని తెలిపారు. అరకొరగా సాగుచేసిన పంటలు సైతం ఎండిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న


బెళుగుప్పలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారి నాగమణి

బెళుగుప్ప, ఆగస్టు 16 : మండలంలో గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులకు మండలకేంద్రానికి చెందిన రైతులు మధునాయక్, గోపాల్ నాయక్, రఘుకు చెందిన మొక్కజొన్న పంట ఎనిమిది ఎకరాలలో నేలకొరిగింది. రెండు నెలల పైరు పడిపోవడంతో రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. అగ్రికల్చర్ అధికారి నాగమణి నేలకొరిగిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.

పుట్లూరు: మండలంలోని అరకటవేముల గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర సాగుచేసిన మొక్కజొన్న పంటను శుక్రవారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో తక్కువమంది రైతులు పంటలను సాగుచేశారన్నారు. ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించామన్నారు. రైతు నాగేంద్రకు పంట నష్టపరిహారం అందించాలని సంబంధిత అధికారులను కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చిన్నకృష్ణుడు, నాయకులు సత్తార్‌గోపాల్, కుళ్లాయప్ప, గోపాలకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.